# మోగిన నగారా

**పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం**



- మే 13న ఎన్నికలు, జూన్ 4న ఓట్ల లెక్కింపు, ఫలితాలు
- ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్
- 18వ తేదీ నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- 26వ తేదీ నామినేషన్ల పరిశీలన
- ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం
- చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి నాలుగోసారి జరుగనున్న ఎన్నికలు

వికారాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నగారా మోగింది. శనివారం కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రోజు నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానున్నది. నామినేషన్లను దాఖలు చేసేందుకుగాను ఏప్రిల్ 25 వరకు ఎన్నికల సంఘం గడువిచ్చింది. ఏప్రిల్ 26న నామినేషన్లను ఎన్నికల అధికారులు పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకుగాను ఏప్రిల్ 29 వరకు గడువిచ్చింది. మే 13న పోలింగ్ జరుగనుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపుతోపాటు ఎన్నికల ఫలితాలను వెల్లడించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన దృష్ట్యా శనివారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అదేవిధంగా లోక్‌సభ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకుగాను జిల్లా ఎన్నికల అధికారులు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. చేవెళ్ల లోక్‌సభకు సంబంధించి నాలుగోసారి ఎన్నికలు జరుగనున్నాయి. మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలతో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో మొదటిసారి 2009లో ఎన్నికలు జరుగగా, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఎస్.జైపాల్‌రెడ్డి ఎంపీగా గెలుపొందారు. తదనంతరం 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంపై బీఆర్‌ఎస్ పార్టీ విజయదుందుభి మోగించింది. 2014 ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, 2019 ఎన్నికల్లో గడ్డం రంజిత్‌రెడ్డిలు బీఆర్‌ఎస్ తరఫున ఎంపీలుగా గెలుపొందారు. ఈ దఫా ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున కాసాని జ్ఞానేశ్వర్ బరిలో ఉండగా, బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు.

**అమల్లోకి ఎన్నికల కోడ్..**

షెడ్యూల్ విడుదల చేసిన దృష్ట్యా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల కోడ్‌ను ఎవరూ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సిద్ధమైంది. ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలోని పోస్టర్లు, బ్యానర్లను 24 గంటల్లో తొలగించనున్నారు. బహిరంగ ప్రదేశాల్లో బ్యానర్లను 48 గంటల్లో తొలగించాలని, ఇంటి యజమాని అనుమతితోనే బ్యానర్లు, గోడపత్రికలను అతికించాలని, అనుమతిలేనట్లయితే 72 గంటల్లో తొలగించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 వరకు వరకు ఆయా పార్టీల ఎన్నికల ప్రచారం చేసుకోవచ్చు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రచారాన్ని నిషేదిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఆలయాలు, మసీదులు, చర్చీల్లో ప్రచారం చేసేందుకు వీలులేదు. జిల్లా అంతటా పోలీసులు నిఘా పెంచనున్నారు. జిల్లాలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతోపాటు అంతర్ జిల్లా చెక్‌పోస్టులను అందుబాటులోకి తీసుకురానున్నారు. సంబంధిత చెక్‌పోస్టుల్లో తనిఖీలను ముమ్మరం చేయనున్నారు. రూ.50 వేలకు మించి నగదు తరలించే వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

**ఎన్నికల ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం..**

మే 13న జరుగనున్న చేవెళ్ల లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జిల్లా ఎన్నికల యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే ఓటరు తుది జాబితాను విడుదల చేసిన అధికారులు మిగతా ఎన్నికల పనుల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికల నిర్వహణకుగాను సుమారు 9 వేల సిబ్బంది అవసరమని గుర్తించిన జిల్లా ఎన్నికల అధికారులు త్వరలోనే ఎన్నికల సిబ్బందిని నియమించి, వారికి శిక్షణనిచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలు చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోకి రానుండగా, కొడంగల్ నియోజకవర్గం మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్నది. జిల్లాకు సరిపోను ఈవీఎంల తోపాటు అదనంగా ఈవీఎంలను అందుబాటులో ఉంచారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తీసుకెళ్లడం, పోలింగ్ పూర్తయిన అనంతరం తిరిగి స్ట్రాంగ్‌రూంకు తీసుకెళ్లే వరకు పకడ్బందీ ఏర్పాట్లను చేస్తుండడంతోపాటు రూట్ మ్యాప్‌లను కూడా తయారు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలను ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవీఎంల పనితీరుపై ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించిన జిల్లా యంత్రాంగం, ఓటర్లకు కూడా ముందస్తుగా ఈవీఎంల పనితీరుపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంచారు. ఈవీఎంలకు సంబంధించి ఫస్ట్ లెవల్ చెక్ ప్రక్రియ పూర్తి కాగా, మరో వారంలో రెండో విడుత ఈవీఎంల పరిశీలన ప్రక్రియను చేపట్టనున్నారు. ఈవీఎంలకు సంబంధించి ఏదైనా సాంకేతిక సమస్యలు ఏర్పడితే వెంటనే వేరే ఈవీఎంలను ఏర్పాటు చేసే విధంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో అదనంగా ఈవీఎంలను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టారు. జిల్లాలోని 1133 పోలింగ్ కేంద్రాలకు అదనంగా ఈవీఎంలను సమకూర్చేందుకుగాను ఈవీఎంలు తక్కువ పడడంతో ఈసీఐఎల్ నుంచి జిల్లాకు కొత్తగా ఈవీఎంలను ఎన్నికల సంఘం చేరవేర్చింది. జిల్లాకు అదనంగా 275 ఈవీఎంలు ఈసీఐఎల్ సంస్థ నుంచి జిల్లాకు చేరుకున్నాయి. ప్రస్తుతం జిల్లాలో బ్యాలెట్ యూనిట్లు-2267, కంట్రోల్ యూనిట్లు-1694 ఉండగా, వీవీప్యాట్లు-1791 ఉన్నాయి.

**ఓటరు నమోదుకు మరో అవకాశం...**

పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకుగాను కొత్త ఓటరు నమోదు చేసుకునేందుకుగాను ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. నామినేషన్లు ముగిసే వరకు అంటే ఏప్రిల్ 25 వరకు మీసేవ లేదా ఆన్లైన్ ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడంతోపాటు మార్పులు, చేర్పులకు అవకాశమిచ్చింది.



మహేశ్వరంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



షాద్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

# అరెస్టుపై... ఆగ్రహ జ్వాల

**ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేయడంపై భగ్గుమన్న బీఆర్‌ఎస్ శ్రేణులు**

- ధర్నాలు, రాస్తారోకోలతో దద్దరిల్లిన ఉమ్మడి జిల్లా
- ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు, కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మల దహనం
- ఎమ్మెల్సీ కవితను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్
- పలుచోట్ల బీఆర్‌ఎస్ శ్రేణుల అరెస్ట్, సొంత పూచీకత్తుపై విడుదల

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్టు చేయడంపై శనివారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా భగ్గుమన్నది. బీఆర్‌ఎస్ శ్రేణులు చేపట్టిన నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలతో అట్టుడికిపోయింది. కవితను వెంటనే విడుదల చేయాలంటూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ర్యాలీలు తీయడంతో పాటు రోడ్లపై బైఠాయించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మోదీ డౌన్ డౌన్...కేంద్ర ప్రభుత్వ వైఖరి నశించాలి.. ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి..కవితను వెంటనే విడుదల చేయాలంటూ పెద్ద ఎత్తున నినదాలు చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ పోకడలు పోతూ రాజకీయ కక్షతో సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను ఉసిగొలిపి కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ఒక రోజు ముందు అరెస్టుకు పాల్పడటంతోనే మోదీ కుట్ర తేటతెల్లమైందని, బీఆర్‌ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కరెంటు కష్టాలు, ఎండుతున్న పంటలు, తాగునీటికి కటకట.. మార్పు అంటే ఇదేనా అని ప్రశ్నించారు.

- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



పరిగిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



మహేశ్వరంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



ధారూరులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, పార్టీ శ్రేణులు



ఆమనగల్లులో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



**ఆహారం ప్రధానం..**

ఏడాది పొడవునా బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థుల్లో కొందరు వార్షిక పరీక్షల సమయంలో అనారోగ్యానికి గురై ఫలితాల సాధనలో వెనుకబడిన సందర్భాలు అనేకం. పిల్లలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు ఒత్తిడిని దూరం చేసుకునేందుకు రోజువారీగా తీసుకునే ఆహారంలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల సమయంలో మాంసాహారానికి దూరంగా ఉండడం మేలు. సాత్విక ఆహారంతో శరీరానికి కావాల్సిన పోషకాలు లభించడంతోపాటు ఉత్సాహం చేకూరుతుంది. పండ్లు, కూరగాయలు తీసుకుంటే మెదడు చురుగ్గా పని చేస్తుంది. పరీక్షకు వెళ్లే సమయానికి మూడు గంటల ముందే తేలికపాటి అల్పాహారం తీసుకోవాలి. మధ్యాహ్నం, రాత్రి బలవర్ధకమైన ఆహారం తక్కువ మోతాదులో తీసుకుంటే మంచిది.




## 18 నుంచి ఎస్సెస్సీ పరీక్షలు

# టెన్షన్ వద్దు

**ఆత్మ విశ్వాసంతో ఒత్తిడి దూరం**

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేది పదో తరగతి వార్షిక పరీక్షలు. సంవత్సరమంతా కష్టపడి చదివి పరీక్షలు దగ్గర పడుతున్న కొద్దీ ఆందోళనకు గురవుతూ ఉంటారు. ఒత్తిడిని అధిగమించి, ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. ప్రశాంత వాతావరణంలో చదువుకోవడంతో పాటు రోజు తీసుకునే ఆహారపు అలవాట్లలోనూ కొద్దిపాటి మార్పులు చేసుకుంటే సరి. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు తల్లిదండ్రుల తోడ్పాటు ఎంతో కీలకం. నచ్చిన ప్రదేశాలు, ఇష్టమైన వ్యక్తుల సమక్షంలో ఏకాగ్రతతో చదువుకోవడం ఎంతో మేలు. పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం కొన్ని సలహాలు, సూచనలపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం..

- షాబాద్, మార్చి 16

పదో తరగతి పరీక్షలు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలంటే తల్లిదండ్రుల పాత్ర కీలకం. పిల్లలకు చదువురాదని, మార్కులు తక్కువగా వస్తాయని, ఫెయిల్ అవుతారని, వారి స్నేహితుల కన్నా వెనుకపడ్డావంటూ నెగెటివ్ ధోరణితో కించపర్చొద్దు. ఈ ఒత్తిడి విద్యార్థి మనసుపై దాడి చేస్తుంది. ప్రతి విద్యార్థి ఒత్తిడిని ఎదుర్కోవడానికి ప్రయత్నించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయానికి చేరువ కావచ్చు.

**సందేహాలను నివృత్తి చేయాలి..**

పరీక్షల సమయంలో ఏదైనా సందేహం వస్తే అది నివృత్తి కాకపోతే దానిమీదకే ఆలోచనలు పోయి సమయం వృథా అవుతుంది. ఉపాధ్యాయులు అప్పటికప్పుడే నివృత్తి చేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. ప్రశ్నాపత్రం విషయంలో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ పరీక్ష సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా సూచనలివ్వాలి.

**విద్యార్థులు ఆత్మ పరిశీలన చేసుకోవాలి..**

ముందుగా ప్రతి విద్యార్థి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఇదివరకే కొన్ని పరీక్షలు రాసి ఉంటారు.. ఆ పరీక్షల్లో తమ పెర్‌ఫార్మెన్స్ ఎలా ఉందో బేరీజు వేసుకోవాలి. ఎక్కడ మిస్టేక్స్ చేస్తున్నామనే విషయాన్ని ఎవరికి వారు గ్రహించుకోవాలి. ఏ పాఠ్యాంశాలలో పొరపాట్లు చేస్తున్నది పాయింట్ల వారిగా నోట్ చేసుకుని అవసరమైనంత మేరకు అభ్యసించాలి.

**తల్లిదండ్రులు ఏం చేయాలంటే..**

పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలి. పిల్లల్లో మరింత ఒత్తిడిని పెంచే వ్యాఖ్యలు చేయకూడదు. అంతేకాక పిల్లలు ఎక్కువ సమయం చదువుకే కేటాయిస్తారు. కాబట్టి వారి ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవాలి. సమయానుకూలంగా తగిన ఆహారం అందిస్తూ ఉండాలి. అవసరమైనంత నిద్ర లేకపోతే ఆరోగ్యం దెబ్బతింటుంది.

**మిత్రులే మార్గదర్శకులు..**

విద్యార్థిలో ఉన్న ఒత్తిడి అతడి మిత్రుడికి కచ్చితంగా తెలుస్తుంది. ఒత్తిడిని అధిగమించేలా ఆత్మవిశ్వాసం నింపేది స్నేహితులే. అధ్యాపకులు, తల్లిదండ్రుల మాటల కంటే మిత్రుల మాటలే విద్యార్థిపై అధిక ప్రభావం చూపిస్తాయి. మంచి మిత్రుడెపుడూ ఒత్తిడికి గురయ్యే ప్రతిక్షణాన్ని పసిగడుతూ ఉంటాడు. ఒత్తిడి చీకటిలా పరుచుకుంటున్న సమయంలో చిరుదివ్వెలా మనుసులో వెలుగు నింపే మార్గదర్శి అతడే. చిరునవ్వుతో ఒత్తిడిని అధిగమిస్తూ పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉన్నదని నిపుణులు సూచిస్తున్నారు.

**ఆరు గంటల నిద్ర అవసరం..**



బాగా తినాలి.. బాగా చదవాలి.. బాగా పరీక్షలు రాయాలి. ఈ మూడు అంశాలను విద్యార్థులు దృష్టిలో పెట్టుకోవాలి. పరీక్షల్లో బాగా రాయాలనే ఆత్రుతతో సమయపాలన లేకుండా చదవడం మంచిది కాదు. నిద్రలేమితో మానసిక ప్రశాంతత దెబ్బతింటుంది. పరీక్షా కేంద్రాల్లో కండ్లు మూతపడుతుంటాయి. కునుకు తీయాల్సి వస్తుంది. ఏకాగ్రత కోల్పోతుంది. చదివినవి గుర్తుకురావు. సమాధానాలు సరిగా రాయలేరు. అందుకే పరిపూర్ణంగా నిద్ర పోవాలి. విద్యార్థులు రోజుకు ఆరు గంటలకు తగ్గకుండా నిద్రపోవడం తప్పనిసరి.

## రాత బాగుంటే మంచి మార్కులు..

- పరీక్షల్లో చదవడంతోపాటు రాత కూడా ముఖ్యం. చేతిరాత బాగుంటే 10 నుంచి 15 శాతం మార్కులు అదనంగా పొందవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

**రాసేటప్పుడు ఇవి గుర్తుంచుకోవాలి..**

- పెన్ను, పెన్సిల్ పట్టుకునే విధానం తగిన విధంగా ఉండాలి.
- ఎట్టి పరిస్థితుల్లో రెడ్, గ్రీన్ పెన్నులు వాడకూడదు. బ్లూ లేదా బ్లాక్ పెన్నులు వాడాలి.
- పదాలు, వాక్యాలు, పేరాల మధ్య తగిన స్థలం వదలాలి.
- అక్షరాలు సైజు స్పష్టంగా కనిపించేలా ఒకే తీరు ఉండాలి.
- గొలుసుకట్టు రాత, అక్షరం, భాషా దోషాలు ఉండకూడదు.
- వేగంగా రాయడం ప్రాక్టీస్ చేయాలి.

**ఇవి పాటించాలి..**

- సమాధానం రాసేముందు ప్రశ్నల నంబర్లు సరిగ్గా వేయాలి
- సమాధాన పత్రాలు ఇవ్వగానే స్కేల్ సాయంతో తగిన మార్జిన్ పెట్టుకోవాలి.
- జవాబు పత్రంపై ఒక్కో పేజీకి 16 నుంచి 18 లైన్లకు మించకుండా చూసుకోవాలి.
- ఆన్సర్ షీట్‌పై ప్రతి వాక్యం స్ట్రెయిట్‌గా ఉండేలా రాయాలి.
- ముఖ్యమైన అంశాల కింద అండర్‌లైన్ ఉండేలా చూసుకోవాలి.
- కామా, ఫుల్‌స్టాప్‌లు పాటిస్తూ రాయాలి.
- తెలుగులో అక్షరాలు గుండ్రంగా, తలకట్టు, దీర్ఘాలు, ఒత్తులు కనిపించేలా ఉండాలి.
- ఇంగ్లిష్‌లో పదాలను స్లాంట్‌గా, స్ట్రోక్స్ పాటిస్తూ రాయాలి.
- స్పెల్లింగ్ మిస్టేక్స్ లేకుండా చూసుకోవాలి. ఓవర్ రైటింగ్ ఉండకూడదు.
- క్యాపిటల్, స్మాల్ లెటర్స్ వ్యత్యాసం గమనిస్తూ రాయాలి.
- సైన్స్, సోషల్‌లో బొమ్మలు గీయడం లేదా పటాల్లో స్థలాలను స్పష్టంగా గుర్తించాలి.

## మానసిక సన్నద్ధత ఇలా...

- కేంద్రాన్ని ముందుగానే చూసుకుంటే చివరి నిమిషంలో హైరానా ఉండదు.
- పరీక్ష ముందురోజు హాయిగా నిద్రపోవాలి. నిద్ర మెదడు పనితీరును ప్రభావితం చేస్తుంది.
- పరీక్షలకు వెళ్లే ముందు పెన్ను, పెన్సిల్, ప్యాడ్, హాల్‌టికెట్‌ను సరి చూసుకోవాలి.
- ఎగ్జామ్ సమయానికి అరగంట ముందే కేంద్రానికి చేరుకునేలా ప్లాన్ చేసుకోవాలి.
- కొత్త వాతావరణంలో ఉన్నామనే భయాన్ని వదిలేయాలి.
- ప్రశ్నలన్నింటినీ క్షుణ్ణంగా చదివి, బాగా రాయగలననుకున్న ఆరేడు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. చివరగా ఎంపిక చేసుకున్న ప్రశ్నలకు జవాబులు రాయడం మంచిది.